ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 05.09.2026 సమయం:18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలోని కీలక రహదారి ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలని రాష్ట్ర రోడ్లు , భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గుజరాత్‌లో జరుగుతున్న చింతన్ శివిర్ –2026 లో కేంద్రాన్ని కోరారు.

2. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా , తప్పుడు వివరాలు ఇచ్చిన దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.

3. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రేపు దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట ‘35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని’ ప్రారంభించనున్నారు.

4. రాష్ట్రంలో ఈరోజు, రేపు వాతావరణం పొడిగా ఉంటుందని , ఎల్లుండి రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది.

---

కోమటిరెడ్డి

తెలంగాణలోని కీలక రహదారి ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలని రాష్ట్ర రోడ్లు , భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. గుజరాత్‌లోని ఎక్తానగర్‌లో జరుగుతున్న చింతన్ శివిర్ –2026 సందర్భంగా ఈరోజు గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశం అయిన రాష్ట్ర మంత్రి.. ఎల్‌బీనగర్ –హయత్‌నగర్ మధ్య డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను మంజూరు చేయాలని కోరారు. పర్వతమాల కింద ఐదు రోప్‌వేలు , సేతు బంధన్

కింద మూడు ఆర్వోబీ , ఆర్‌యూబీలు, సీఆర్ఐఎఫ్ కింద 33 రహదారి పనులకు ఆమోదం ఇవ్వాలన్నారు.

డెస్క్

సీఈఓ

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా ఫారం-6 , 6ఏ, 7, 8లలో తప్పుడు వివరాలు ఇచ్చిన దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ , అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు ఈరోజు మెమో జారీ చేశారు. ఓటర్ల నమోదు అధికారుల వద్ద ఫారం-7 దరఖాస్తులను పెద్ద సంఖ్యలో దాఖలు చేసినట్టు , అవి నిజమైనవి కావని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ ఆదేశాలిచ్చారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం , 1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని , అంతకుముందు ఓటర్ల నమోదు నిబంధనలు , 1960లోని రూల్ 20 కింద విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు.

డెస్క్

గవర్నర్

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం మెదక్ జిల్లాలో పర్యటించి , దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు ఎన్‌హెచ్ –765డీజీ వెంట ఈ ప్లాంటేషన్ చేపడుతున్నారు. అంతకుముందు ఐడీఓసీకి చేరుకుని , నషా ముక్త్ ర్యాలీని ప్రారంభిస్తారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి , స్వయం సహాయక సంఘాల సభ్యులతో, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారు.

డెస్క్

**గోదావరి పుష్కరాలు**

గోదావరి పుష్కరాలకు  పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి  ,  కోటిలింగాల పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన తాగునీరు , పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్, రహదారులు తదితర మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.

పీటీసీ, జగిత్యాల

రాంచందర్ రావు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన మన దేశ ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు.  హైదరాబాద్ లోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో జరిగిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు మంచివని  , ఓడిపోతే ఈసీని తప్పుపట్టడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

HYD ,PTC

సీఎస్

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పనులను వేగవంతం చేయాలని , ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్  ల ఏర్పాటుకు ప్రత్యేక విధానం రూపొందించాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో సోమవారం సీనియర్ అధికారులతో సమీక్షించిన ఆయన  , రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఈ స్కూళ్లను దశలవారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2027 డిసెంబర్ నాటికి 67 స్కూళ్లు, 2028 జున్ నాటికి 87 స్కూళ్లు పూర్తి చేయాలని సూచించారు.

డెస్క్

టీజీఎన్పీడీసీఎల్

భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి , మౌలిక వసతులను ఇప్పటి నుంచే బలోపేతం చేయాలని TGNPDCL - CMD కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి ఈ రోజు 18 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం , పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రబీ, వేసవిలో పెరిగే విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని , మరమ్మతులకు గురైన వాటిని ఆలస్యం లేకుండా బాగుచేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. 60 శాతానికి పైగా లోడ్ ఉన్న డీటీఆర్‌లను గుర్తించి , సామర్థ్య పెంపు లేదా అదనపు డీటీఆర్‌ల ఏర్పాటు చేపట్టాలన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు.

డెస్క్

పొంగులేటి

రీ సర్వే త్వరలోనే పూర్తి చేసి అందరికీ నూతనంగా పట్టా పాస్ పుస్తకాలు అందిస్తామని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు నిర్మల్ జిల్లాలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..

<u>బైట్</u>: పొంగులేటి

పిటిసి నిర్మల్ జిల్లా

అవగాహన

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహనతోనే వ్యాధి నివారణ సాధ్యమని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె. విద్యాసాగర్ అన్నారు. కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, ముందస్తు పరీక్షలతో వ్యాధిని గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష , అపోహలను తొలగించాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులు పీర్ ఎడ్యుకేటర్లుగా కీలక పాత్ర పోషించాలని కోరారు.

డెస్క్

సింగరేణి

ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయానికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు ఉందన్న వార్తలు అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే ముందుకెళ్లాలని నిర్ణయించినట్టు ఒక ప్రకటనలో తెలిపింది.

డెస్క్

వాతావరణం

నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు తెలంగాణలో పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనక్కి మళ్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో ఈరోజు, రేపు వాతావరణం పొడిగా ఉంటుంది. ఎల్లుండి రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

పీఎన్

**వెంకటస్వామి**

కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి జయంతి కార్యక్రమాలు ఈరోజు పలు జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన వెంకట స్వామి సేవలు చిరస్మరణీయం అని జగిత్యాల జిల్లా ధర్మపురిలో జరిగిన కార్యక్రమంలో సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పేదల అభ్యున్నతి కోసం , తెలంగాణ రాష్ట్రం కోసం కాకా నిరంతరం తపించారని పెద్దపల్లి లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ , అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పీటీసీ, జగిత్యాల, పీటీసీ, పెద్దపల్లి, పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

బాల మాయాదేవి

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు , విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని, నిర్ణీత కాలపట్టికను ఖచ్చితంగా పాటించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు.

పీటీసీ, పెద్దపల్లి